# ప్రేమిస్తే ఏమవుతుంది?

## జి.ఎస్.సూరి

విజయవాడకు దగ్గర్లోనే ఉండటంచేత నాకు రామచంద్రమూర్తి గారింట్లోని పెళ్ళికి వెళ్ళటం తప్పనిసరైంది. పైగా వాళ్ళు రాజమండ్రీలో ఉండగా నాకు ఆ కుటుంబంతో ఎక్కువ సన్నిహితత్వం వుండేది. ముఖ్యంగా ఆయన భార్య రాజ్యలక్ష్మిగారికి నేనంటే అంతులేని అపేక్ష. నేనావిడ్ని "అక్కయ్యా" అని పిలుస్తూండేవాడ్ని.

పెళ్ళింట్లో అడుగు పెట్టగానే నాకు ఆదరపూర్వకమైన స్వాగతం లభించింది.

"రా....సూర్యం....రా....రా...." అంటూ రాజ్యలక్ష్మిగారు నవ్వుతూ ఎదురొచ్చారు. నా రాక ఆవిడకు ఆనందం కలిగించిందని స్పష్టంగా తెలుస్తోంది.

"మెత్తానికి జ్యోతి పెళ్ళికూతురైందన్న మాట!" అని "ఇంతకూ పెళ్ళికూతురేదీ?" అనడిగాను.

అంతలోకి రామచంద్రమూర్తి గారు రావటం నన్ను వాళ్ళిద్దరూ పెళ్ళికూతురు దగ్గరకు తీసుకొని వెళ్ళటం జరిగింది. ఒక గదిలో చాలా మంది ఆడవాళ్ళ మధ్యనున్న కూతుర్ని ఇవతలకు పిల్చారు రామచంద్రమూర్తి గారు.

"ఎవరో గుర్తుపట్టావా జ్యోతీ?....సూర్యం అంకుల్!" అన్నారాయన కూతురికి నన్ను చూపిస్తూ.

ఆ అమ్మాయి నావైపు తదేకంగా చూస్తూ జ్ఞప్తికి తెచ్చుకోటానికి ప్రయత్నించింది. నాకు తెలుసు జ్యోతికి నేను గుర్తుండనని. చాలా సంవత్సరాల క్రితం చూసింది. అప్పుడా అమ్మాయి వయసు ఎనిమిదేళ్ళుంటాయేమో!

"సారీ డాడీ.... ఐయామ్ అనేబుల్ టు రికలెక్ట్ హిమ్" అంది నొచ్చుకున్నట్లు మొహం పెట్టి తండ్రివైపు చూస్తూ జ్యోతి.

వెంటనే రాజ్యలక్ష్మిగారు "అదేమిటి జ్యోతీ! చిన్నప్పుడు నీకు కథలు చెప్పేవారూ .... ఆ అంకుల్" అన్నారు గుర్తుకు తేవటానికి ప్రయత్నిస్తూ.

జ్యోతి నా వైపు కనుబొమలు ముడిచి చూసింది.

ఆమె జ్ఞాపకాల తెరను కదల్చటానికి ప్రయత్నించింది. కాని ప్రయోజనం లేకపోయింది. ఆమె నిస్సహాయంగా తల్లితండ్రుల వైపు చూసింది.

నేను నవ్వేస్తూ—"అప్పటికి చాలా చిన్నపిల్ల కదూ?....మర్చిపోయుంటుంది లెండి" అన్నాను.

"ఆఁ....ఆఁ...." అంటూ మొహమాటంగా నవ్వేశారు వాళ్లు కూడా. జ్యోతి మళ్ళీ గదిలోకి వెళ్లిపోయింది. ఆ అమ్మాయికి నేను కొంచెం కూడా గుర్తులేక పోవటం నాకు వింతగానే వుంది. ఎందుకంటే అప్పట్లో నేను రోజస్తమానూ వాళ్లింట్లోనే గడిపేవాణ్ని.

అప్పటి జ్యోతికి ఇప్పటి జ్యోతికీ చాలా తేడా వుంది. చిన్న చిన్న ఫ్రాక్స్‌లో రబ్బరు బొమ్మలా వుండేది అప్పటి జ్యోతి. ఈ జ్యోతి పట్టుచీరలో పెళ్లికూతురిగా రేఖా చిత్రంలా వుంది. నాకు మాత్రం కొన్ని క్షణాల క్రితం వరకూ చిన్నప్పటి జ్యోతే కళ్ళముందు వుండిపోయింది.

రామచంద్రమూర్తిగారు పనుందని చెప్పి ఇప్పుడే వస్తానంటూ వెళ్లిపోయారు. రాజ్యలక్ష్మిగారు నన్ను వేరే గదిలోకి తీసుకుని వెళ్లి టిఫిన్ అందిస్తూ- "కాఫీ పంపిస్తాను" అంటూ వెళ్ళారు.






నేను టిఫిన్ తినటం పూర్తిచేసి చేతులు కడుక్కుని ఆ ప్రక్కనే పెట్టెమీద పుస్తకం వుంటే చేతిలోకి తీసుకుని చూస్తూ కూర్చున్నాను.

"కాఫీ తీసుకుంటారా?" - ఎవరిదో కంఠం వినిపించి తలెత్తాను.

ఒక్కమాటు త్రుళ్లి పడినట్లయ్యాను. నా మనసులో ఏదో ఉద్వేగం....ఏదో ఆవేదన.... ఎన్నో రకాల అనుభూతులూ—జ్ఞాపకాలు ఉప్పెనగా విరుచుకుపడి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఎదురుగా కిరణ్మయి నిలబడి వుంది.

ఒకప్పుడూ....ఇప్పుడూ .... ఇంకెప్పుడూ నేను అత్యధికంగా ప్రేమించే ప్రేమదేవత. ఏ క్రూరదైవమో కసికట్టి-పగబట్టి నానుంచి వేరు చేసిన నా ప్రియసఖి.

ఎన్నాళ్ళకూ—యెన్నేళ్ళకూ!

నా హృదయం మూగవోయింది.

అన్నేళ్ళ తర్వాత చూడటం జరుగుతోందేమో .... ఏం మాట్లాడాలో యెలా మాట్లాడాలో కూడా తెలియటం లేదు.

అలా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాను.

చెరువుల్లాంటి కళ్ళతో సూటిగా నావైపే చూస్తోంది కిరణ్మయి. ఆ చూపుల్లో చురుకుదనం అలానే వుంది. కాకపోతే మనిషిలో పెద్దరికం—గాంభీర్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

"కాఫీ తీసుకోండి!" మళ్ళీ అంది కిరణ్మయి.

నేను మౌనంగా కాఫీ అందుకున్నాను.

కిరణ్మయిని అంత హఠాత్తుగాఅలా చూస్తానని—చూడగలననీ అనుకోలేదు నేను.

"బావున్నారా?" అడిగింది కిరణ్మయి.

"ఊఁ" అంతకంటే ఏమనాలో తోచలేదు.

"జ్యోతిని చేసుకుంటున్నది మా బంధువు లబ్బాయే!"తనక్కడకు రావటానికి గల కారణం చెప్పేటందుకు కాబోలు అంది.

"జ్యోతి చాలా పెద్దదయిపోయింది. నన్నసలు గుర్తుపట్టలేదు!" అన్నాను. నాకు తెలుసు ఆ మాట అక్కడ అనటం అసందర్భమేనని.

రెండు నిమిషాలు ఇబ్బంది కరమైన నిశ్శబ్దం అలుముకుంది.

"ఊఁ....చెప్పు!" అన్నాను. అలా అంటూ ఏదో జ్ఞాసకం వచ్చినట్లు కిరణ్మయి మొహంలోకి చూశాను. నా అంచనా తప్పు కాలేదు. కిరణ్మయి మెత్తగా నవ్వింది. ఇదివరలో మాటిమాటికి ఆమె దగ్గర కూర్చుని కబుర్లు చెబుతూ అలా అంటూండేవాణ్ణి.

అలా అన్నప్పుడల్లా కిరణ్మయి తమాషాగా కనుబొమలు ముడిచి - "ఏం చెప్పమంటారూ? ఏం మాట్లాడమంటారు?....చెప్పటం మాట్లాడటం కొందరి స్వంతం....నాకు వినటం మాత్రమే తెలుసు!" అనేది.

అది నిజమే. నేను కబుర్లు చెబుతున్నంతసేపూ గంటల తరబడి విసుగు లేకుండా ఆసక్తిగా వినేది.

అసలు కిరణ్మయితో నా పరిచయం వింతగా పెరిగి పెద్దదైంది. రామచంద్రమూర్తిగారి పిన తల్లిగారమ్మాయి కిరణ్మయి. రాజమండ్రీ కాలేజీలో చదువుకునేందుకు వాళ్ళింట్లో వుండేది. "వదినా....వదినా...." అంటూ రాజ్యలక్ష్మిగారి వెనుకే వుండే కిరణ్మయి చాలా చురుకైనదనీ—మాటకారనీ పరిచయం పెరిగాక కాని తెలియలేదు నాకు.

నా మనసూ—ఆలోచన్లూ గతంలోకి వెళ్ళిపోతూంటే కిరణ్మయి పలకరింపు నన్ను మళ్ళీ వర్తమానానికి తీసుకొచ్చి నిలబెట్టింది.

"మీరొక్కరే వచ్చారా?" కిరణ్మయి అడిగింది.

ఎదురుగా యింతసేపూ కనిపిస్తున్నది ఒక్కడ్నే అయినా కిరణ్మయి అలా యెందుకు అడిగిందో సులభంగానే గ్రహించాను. అయినా-

"అంటే?" అన్నాను ఆ ప్రశ్న అర్థం కానట్లు నటిస్తూ.

"అదే... అదే .... ఇంకెవర్నీ తీసుకు రాలేదా?" తటపటాయిస్తున్నట్లు అడిగింది..

నేను జీవంలేని నవ్వు నవ్వి- "తీసుకురాతగ్గ వాళ్ళెవరూ లేరు!" అన్నాను.

"అంటే....మీరు..?"ఆగిపోయింది. ఆమె మొహంలో యేదో సందేహం.

"అవును....అంతే!" అంతకంటే ఆమెకర్థం అయ్యేలా చెప్పలేకపోయాను. కిరణ్మయి జాలిగా చూసింది. బాధపడుతూ చూసింది. దిగులుగా చూసింది. ఆమె కళ్ళల్లో ఒకదాని తరువాత ఒకటి ఫీలింగ్స్ మారిపోతూ కనిపించాయి.

ఆమె పెదాలు నిశ్శబ్దంగా....అతి మెల్లగా విచ్చీ విచ్చుకున్నట్లు కదులుతున్నాయి. ఏదో అడగాలని ఆరాటం....ఏదో చెప్పాలని తాపత్రయం....ఆమెలో....ఆ పెదవుల కదలికలో ప్రస్ఫుటమౌతున్నాయి.

"ఏం సూర్యం....స్నానం చేయరాదూ?.. మళ్ళీ హడావిడై పోతుంది?" అంటూ రాజ్యలక్ష్మిగా రొచ్చారు.

అలాగే అన్నట్లు తలూపి లేచాను.


"కిరణ్మయీ! సూర్యానికి స్నానం ఏర్పాట్లు చూస్తావా?" రాజ్యలక్ష్మిగారు అడిగారు.

"అదేమిటీ. కిరణ్మయి మగపెళ్ళివారట కదూ .... తనకి పన్లు చెప్తున్నారేమిటీ?" నవ్వుతూ అడిగాను.

"నా నాయనే.... ఆలాంటివి జ్ఞాపకంచేసి చక్కగా పన్లు చేసిపెట్టేదాన్ని చెడగొట్టకు. ఏదో సగం ఇటూ చక్కబెట్టుకు వస్తోంది."అన్నారు రాజ్యలక్ష్మిగారు.

ముగ్గురం హాయిగా నవ్వుకున్నాం.

రాజ్యలక్ష్మిగారు పనుందంటూ వెళ్ళిపోయారు. నేను కిరణ్మయి వెనుక నడిచాను. నాకు బాత్‌రూమ్ చూపించి ఇప్పుడే వస్తానంటూ వెళ్ళింది. నేను స్నానం ముగించి బట్టలు మార్చుకుని గదిలో కూర్చున్నాను.




అక్కడున్న మంచంమీద వాలి పుస్తకం చేత్తో పట్టుకున్నాను. పుస్తకంమీద ధ్యాస కుదరలేదు. పుస్తకం మూసి ప్రక్కనపెట్టేను.

కిరణ్మయి చాలా పొయిటిక్‌గా మాట్లాడేది. ఆమెకున్న అభిరుచులు చూస్తూంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుండేది. అవి చాలా వున్నతమైనవీ—చాలా వుత్తమమైనవీ. బహుశా అవే నన్ను ఆమెకు బాగా చేరువ చేసుంటాయి. ఎందుకంటే నాకు జీవితాన్ని యెంతో అందంగా ఊహించుకోవటం ఇష్టం. ప్రపంచంలో ప్రతీ అణువులోను సౌందర్యాన్ని వెదికి వేడుక చేసుకునేవాణ్ణి.

అంతులేని అందాన్ని చూసినప్పుడు నాకు విపరీతంగా యేడుపొచ్చేది.

అతిమధురమైన సంగీతానికి నా హృదయం నీరై పోయేది.

అపురూపమైన పుస్తకాలు చదువుతూ ఆకలి దప్పులు మరచిపోయేవాణ్ణి.

ఇంచుమించు ఇవే రకం లక్షణాలు కిరణ్మయిలో ఉండటంచేత నా మనసు ఆమె సాన్నిత్యంకోసం తపించిపోయేది. ఆమె స్నేహంకోసం ఉవ్విళ్ళూరిపోతుండేది.

"వెన్నెట్లో యేటివొడ్డున కూర్చుంటే ఎలా వుంటుంది?"

"పరుగునపోయే రైల్లో కిటికీ ప్రక్కన కూర్చుని నిరంతరం ప్రయాణం చేస్తూంటే తమాషాగా వుండదూ!"

"తెల్లారుఝామున మంచంమీద పడుకుని ఆరు బయట అరవిరిసిన పకృతిని చూస్తూ లతామంగేష్కర్ పాటలు వింటూంటే హాయిగా వుండదూ?"

ఈ రకంగా వుండేవి కిరణ్మయి మాటలు. అవును! కిరణ్మయికి బాహ్య సౌందర్యంతో పాటు ఆత్మ సౌందర్యంకూడా వుంది కనుకనే అంత అందమైన ఆలోచన్లూ, ఆశలూ వున్నాయి. మనసులోని విషయాలు దాపరికం లేకుండా చెప్పుకోవటం....ఆపైన....ఒకర్నొకరు జోక్ చేసుకోవటం .... అలా అలా అత్యంత సన్నిహితులమైపోయి .... చివరకు నేను ఒకరోజు సాయంకాలం యెవరూ లేని సమయంలో పెరటిలో పొగడచెట్టు క్రింద కిరణ్మయిని మెల్లగా....మృదువుగా దగ్గరకు

తీసుకుని బుగ్గలపై ముద్దుపెట్టుకోవడం వరమూ వచ్చింది.

ఒక కన్నెపిల్ల బుగ్గల్ని స్పృశించిన అనుభవం నేను జన్మ జన్మలకూ మర్చిపోలేను. ఆ తర్వాత చాలాసార్లు....అలాగే.... ఆ అందమైన అనుభవం చాలాసార్లు పొందాను. చూపుల్లో అమితమైన అభిమానాన్ని-అనురాగాన్ని కలగలిపి కిరణ్మయి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని చెంపలకూ—మెడకూ తాకించుకుంటూ వుండిపోయేది.

కిరణ్మయి యిక నా స్వంతమయిపోయినట్లే భావించాను. కిరణ్మయితో గడపటంలో నాకు అంతులేని ప్రశాంతత లభించేది. నిరంతరం....నిత్యం నాకు కిరణ్మయి ధ్యాసే.... కిరణ్మయి ఆలోచనే!

ఎవరో పిలిచినట్లయితే వులిక్కిపడి ఈ లోకానికి వచ్చాను.

"ఏమిటీ....ఈ లోకంలో లేరా?....నాలుగు సార్లు పిలిచాను." కిరణ్మయి అంది.

"ఆ?....ఆ!" అంటూ లేచి నిలబడ్డాను.

"పెళ్ళివారు భోజనాలకు వస్తున్నారు.... మిమ్మల్ని వదిన పిలుచుకు రమ్మంది." చెప్పింది.

నేను కిరణ్మయితో బయలుదేరాను.

"మీవారు రాలేదా?"-హఠాత్తుగా అడిగాను ఆమె ప్రక్కనే నడుస్తూ.

ఆమె మెడలో మంగళసూత్రాలు ధగ ధగ మెరుస్తున్నాయి.

"సెలవు దొరకలేదు" ముక్తసరిగా అంది.

మరో నాలుగడుగులు వేశాక- "మరి.... పిల్లలూ?" అడిగాను. అలా అంటున్నప్పుడు నా కంఠం నాకే విచిత్రంగా వినిపించింది.

కిరణ్మయి నడుస్తూనే నా వైపు చూసింది.

నేను చూపులు తప్పించుకున్నాను.

"బేబీ వచ్చింది....బాబుకి స్కూలు!" కిరణ్మయి జవాబిచ్చింది.

"కిరణ్మయికి యిద్దరు పిల్లలన్నమాట!" మనసులోనే అనుకున్నాను. బాగానే వుంది. పిల్లలూ....భర్తా....సంసారం .... సుఖంగానే వుంది. అన్నీ మర్చిపోయి....అందర్నీ మరచిపోయి తన మానాన్న తను హాయిగానే వుంటోంది.

"సాయంకాలం మీకేదైనా పనుందా?" అడిగింది.

ఎందుకన్నట్లు చూశాను.

"సాయంకాలం దుర్గ కొండకు వెళదాం.. మీతో చాలా మాట్లాడాలి. మీతో చాలా చెప్పాలి. మిమ్మల్ని యెన్నో అడగాలి...." గబ గబా అంటున్నట్లు అంది.

అలాగే అన్నట్లు తలూపాను.

అంత దూరంలో రామచంద్రమూర్తిగారు నిలబడివుండటంచేత మేం ఇంకేం మాట్లాడుకోలేదు.

రాజ్యలక్ష్మిగారు వద్దు వద్దంటున్నా వడ్డన చేస్తానంటూ దిగాను. కిరణ్మయికూడా వడ్డనకు తయారయ్యింది. అవి కావాలనేవాళ్ళూ-ఇవి కావాలనే వాళ్ళతో వడ్డన సరదాగా సాగింది. రెండు బ్యాచీలుగా మగపెళ్ళివారు భోజనాలయిలేచారు. అందరికీ భోజనాలయ్యేసరికి రెండు దాటింది.

కాసేపు విశ్రాంతి తీసుకుందుకు గదిలోకి వచ్చేశాను. మంచంమీద వాలి కిరణ్మయిని గురించి ఆలోచించటం మొదలుపెటాను.

సాయంకాలం ఏం మాట్లాడుతుంది కిరణ్మయి?....యేం చెప్తుంది? యేం అడుగుతుంది? అప్పట్లో తను కాదనుకోటానికీ-కాదని ఎవర్నో చేసుకోటానికి గల కారణం చెప్పలేదు. అంతా కలలోలా జరిగిపోయింది. ఆనాడు జరిగిన దానికి ఈనాడు సంజాయిషీ యిచ్చుకుంటుందా? క్షమార్పణ కోరుకుంటుందా? సమర్ధించుకుంటూ మాట్లాడుతుందా?

ఏమో!

కాని కిరణ్మయి నాకు కాకుండా పోయినందుకు కొన్నాళ్ళు పిచ్చివాడ్నయిపోయాను. బతుకుమీద విరక్తి పెరిగి చివరకి జీవితాన్నే ముగించుకుందామా అనిపించేది. రాత్రులకు రాత్రులు అస్సలు నిద్ర పట్టేదికాదు. వంటరిగా కూర్చుని తనివితీరా యేడ్చేవాణ్ని.

ఏదో పనిమీద బెంగుళూరు వెళ్ళిన నేను




నాలుగు రోజుల్లో తిరిగొచ్చేద్దామనుకున్నది నాలుగు నెలలు వుండిపోవల్సివచ్చింది. ఏవో బిజినెస్ వ్యవహారాల్లో ఈరోజూ-రేపూ అనుకుంటూ వుండిపోవటం జరిగింది.

ఎంత పనిలో వున్నా-యేం చేస్తున్నా కిరణ్మయిని మాత్రం మరిచిపోయిందిలేదు. అక్కడ అందమైన కబ్బన్ పార్కు-లాల్ బాగ్ గార్డెన్స్ చూస్తున్నప్పుడు ఆమే గుర్తుకు వచ్చేది. కిరణ్మయే కనుక వుంటే బెంగుళూరు సిటీ అందాలు చూసి మురిసిపోయేది.

అప్పుడే అనుకున్నాను కిరణ్మయిని పెళ్ళి చేసుకున్నాక-బెంగుళూరు హనీమూన్ రావాలని. హాయిగా స్వేచ్ఛావిహంగాలై ఆ పూలవనాల్లో విహరించాలని. కాని-ఆ ఊహలు కరిగిపోతాయనీ-ఆ కలలు భగ్నమైపోతాయనీ యెలా అనుకుంటాను? బెంగుళూరునుంచి కిరణ్మయికి రాసిన నాలుగైదు వుత్తరాలకూ ఒక దానికే జవాబొచ్చింది. మిగిలినవాటి కెందుకు రిప్లై ఇవ్వలేదో అర్థంకాలేదు నాకు.

ఊరునుంచి రాగానే రాజ్యలక్ష్మిగారింటికి వెళ్ళిన నాకు పిడుగులాంటి వార్త తెలసింది. కిరణ్మయికి పెళ్ళి కుదిరిందట. ఆ విషయం చెబ్తూ-"మనం చాలా హడావిడి చేయాలోయ్ సూర్యం!....మగపెళ్ళివారి ఆటలు సాగనీయకూడదు" అన్నారు రాజ్యలక్ష్మిగారు.

నేనేం మాట్లాడలేదు. నా హృదయం మూగపోయింది. నా మనసు చెదిరిపోయింది. నేనేదో పీడకల కంటున్నట్లుంది.

"ఏమిటి సూర్యం మాట్లాడవ్?" రాజ్యలక్ష్మిగారు అడిగారు.

ఆవిడకు కిరణ్మయికీ నాకూ మధ్య నడిచిన ప్రేమ వ్యవహారం తెలియదు. తెలిసేలా మేం ప్రవర్తించనూలేదు. ఎందుకంటే ప్రతి వ్యవహారం బట్టబయలు కావటం నా కిష్టముండదు.

నేనూ లేస్తూ - "సాయంకాలం వస్తానక్కయ్యా!" అన్నాను. రాజ్యలక్ష్మిగారు అదోలా చూస్తూ-"ఏమిటలా వున్నావ్? .... వొంట్లో కులాసాగా లేదా?" అనడిగారు.

"ఉహూ....అదేం కాదు....ప్రయాణం చేసొచ్చాను కదా? అదీ" అన్నాను వచ్చేస్తూ.

కిరణ్మయి యెందుకిలా చేసిందీ? .... నాతో యింత వ్యవహారం నడిపి ఇంతిలా మనస్సెందుకు మార్చుకున్నట్లూ? నా ప్రేమలో యేం లోపం కనిపించింది?....నా వలన యేం తప్పు జరిగిందీ?

నన్ను నేను యెంత శోధించుకున్నా-ఎన్ని విధాల ప్రశ్నించుకున్నా జవాబు దొరకలేదు. కిరణ్మయిని అడుగుదామంటే దూరదూరంగా తిరుగుతూ అందుకు అవకాశమే యివ్వటం లేదు. ఒకవేళ యేకాంతంగా దొరికినా సరైన సమాధానం యిచ్చేది కాదు.

"ఏమిటి కిరణ్మయీ .... యేమిటిది?"— అంటే నిశ్శబ్దంగా చూసేది.

ఆ చూపుల కర్థం నాకు అంతుపట్టలేదు.

"నా వలన యేదైనా తప్పు జరిగిందా?.... యెవరైనా యేదైనా అన్నారా? .... యెందుకిలాంటి నిర్ణయం తీసుకున్నావ్?....యెందుకు నన్నిలా శిక్షించాలనుకుంటున్నావ్?" రుద్ధమైన కంఠంతో అన్నాను.

"ప్లీజ్....నన్నేం అడక్కండి .... నేనేం చెప్పలేను. నేనేం చెప్పను!" కిరణ్మయి చూపులు తప్పించుకుంటూ అనేసింది.

నాకు కోపం ముంచుకువచ్చింది. జీవితం నాశనం అయిపోతూంటే ఇంకా అడగొద్దనటం యేమిటీ?

"చెప్పవా కిరణ్మయీ?"

సమాధానం లేదు.

"అంతేనా?"

దానికీ సమాధానం లేదు.

ప్రేమకోసం యింకెంత దేవిరించాలో నాకు అర్థం కాలేదు. నాకు పౌరుషం ముంచుకొచ్చింది. ఉడుకుమోత్తనం వచ్చింది.

"సరే కిరణ్మయీ....నీ యిష్టం వచ్చినట్లు నువ్వు చేయి. నా యిష్టం వచ్చినట్లు నేను చేస్తాను" ఉక్రోషంగా అన్నాను.

"అంటే-?" కిరణ్మయి అడిగింది.

"నీకు నేను అక్కర్లేనప్పుడు నాకూ-డా ఇంకెవరూ అక్కర్లేదు. జీవితాంతం ఒంటరిగా

వుండిపోతాను." బెదిరించాలని కాదు. బాధగా అన్నాను.

ఒకవేళ కిరణ్మయి హాస్యానికి యిలా చేయటంలేదు కదా? లేదు లేదండి రాజ్యలక్ష్మి గారిచ్చిన శుభలేఖ. మిగిలిన ఆశాదీపం కూడా ఆరిపోయింది.

కిరణ్మయి పెళ్ళి దగ్గరపడుతున్నకొద్దీ నాలో ఆవేశం ఆరాటం యెక్కువౌసాగాయి. కిరణ్మయిని పరాయిదాన్ని కాకుండా చేయగలనా? కిడ్నాప్‌చేసి తీసుకుపోతే?....కాని అందుకు ఆమె సహకరిస్తుందా?....ఉహూ.... కుదరదు. అది జరగదు. ఈ పెళ్ళి కిరణ్మయికి ఇష్టంలేక పోతే కదా?

కిరణ్మయి పెళ్ళి దగ్గరపడుతున్నకొద్దీ నాకు వూళ్ళో వుండాలనిపించలేదు. ఏదో పని కల్పించుకుని విశాఖపట్నం వెళ్ళిపోయాను.

ఆ తర్వాత ఇన్నేళ్ళకి ఇప్పుడు ఈ పెళ్ళిలోనే చూడటం కిరణ్మయిని. ఇన్ని సంవత్సరాల్లోను నిజానికి నే నసలు కిరణ్మయిని మర్చిపోయింది లేదు. నా మనసులో పీఠం వేసుకుని వుండిపోయిన ప్రేమమూర్తిని యెలా చెరిపేసుకుంటాను? అది నాకు సాధ్యం కాలేదు.

కిరణ్మయితో చెప్పినట్లే నాకింకెవర్నీ పెళ్ళి చేసుకోవాలనిపించలేదు. ఆమె స్థానంలో ఇంకెవర్నీ ఊహించుకోలేకపోయేవాణ్ని. చాలా సార్లు నా పెళ్ళివిషయమై ఇంటా - బయటా వొత్తిడిలు వచ్చినా యెవరూ నన్ను ఒప్పించలేకపోయారు. ఒకలా హృదయపూర్వకంగా నాకు నేను విధించుకున్న శిక్షే అది.

"పడుకున్నారా?" అంటూ కిరణ్మయివచ్చి పిలుస్తూంటే చటుక్కున కళ్ళు తెరిచాను.

కిరణ్మయి మంచంప్రక్కన నిలబడివుంది.

"లేవండి....లేచి మొహం కడుక్కుంటే కాఫీ టిఫినూ తీసుకుని బయల్దేరొచ్చు." అంది.

""కాఫీ టిఫినూ బయట తీసుకుందాం.... మొహం కడుక్కుని వస్తాను" అన్నాను.

సరేనన్నట్లు తలూపింది. రాజ్యలక్ష్మి గారితో చెప్పి కిరణ్మయితో బయలుదేరాను. ఇద్దరం మాట్లాడుకుంటూ నడుస్తున్నాం. అప్పటికి యెండతగ్గి చల్లబడింది. షికారుకి వెళ్ళేవాళ్ళతోనూ - సినిమాలకు వెళ్ళేవాళ్ళతోనూ రోడ్డు సందడిగా వుంది. కాఫీ తీసుకోవటానికి మనోరమాకి వెళ్ళాము. సర్వర్‌కు టిఫిన్ ఆర్డర్ చేశాను నేను.

అయిదు నిమిషాల తర్వాత గొంతు విప్పుకుంటూ— "నన్ను సాధించటానికేనా మీరు పెళ్ళి చేసుకోకుండా వున్నది?" కిరణ్మయి అడిగింది.

నేను సూటిగా కిరణ్మయి కళ్ళలోకి చూశాను. కిరణ్మయి క్షణంసేపు నా కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూసి మొహం దించుకుంది.

"నేను మీకు అన్యాయమే చేశాను....మీకు ద్రోహమే చేశాను....నా దంతా తెలివితక్కువ ఆలోచన....అదిప్పుడిప్పుడే తెలుస్తోంది. కాని యిప్పుడు నేనేం చేయగలనూ?" కిరణ్మయి కంఠం బొంగురుపోయింది.

ఆమె కళ్ళల్లోంచి రెండు నీటిబొట్లు రాలి టేబుల్ మీద పడ్డాయి.

సర్వర్ టిఫిన్ తీసుకొచ్చాడు. "తీసుకో కిరణ్మయీ" అన్నాను ఆమెవైపు చూసి.

కిరణ్మయి వాష్‌బేసిన్‌దగ్గరకు వెళ్ళిమొహం కడుక్కుని వచ్చింది. ఇద్దరం టిఫిన్ తీసుకుంటున్నాం.

"నేనంటే మీకు అసహ్యం వేయటం లేదూ?" కిరణ్మయి అడిగింది.

లేదన్నట్లు తలూపాను.

"మీరు నన్ను ద్వేషించటం లేదూ?" మళ్ళీ అడిగింది.

"ఎందుకూ?" అడిగాను.

"మీ జీవితాన్ని పాడుచేసినందుకు!" కిరణ్మయి అంది.


నేను సమాధానం చెప్పలేదు.

"మీరు....మీరు....చాలా గొప్పవారు.... నేనే దురదృష్టవంతురాల్ని!" చిన్నగా నుదుటి మీద కొట్టుకుంది అరచేత్తో.

సర్వర్ కాఫీ తీసుకొచ్చాడు. ఇద్దరం కాఫీ త్రాగటం ముగించాం. బిల్లు ఇచ్చి కిరణ్మయితో బయటకు వచ్చాను.








"రిక్షా పిలవండి...." హోటల్ బయటకు రాగానే అంది.

నేను రెండు రిక్షాలు పిలవబోతుంటే వారించింది. "ఫర్వాలేదు. ఒకటిచాలు. అపవిత్రులం ఆయిపోం" కిరణ్మయి అంది.

నేనామెవైపు చూశాను.

"మీ కభ్యంతరమా?" అడిగింది.

నేను రిక్షా మాట్లాడాను. ఇద్దరం రిక్షా యెక్కాం. నేనొకప్రక్కకు వొదిగి కూర్చోబోతే చురుగ్గా చూసింది. అది చూసి నేను మామూలుగా కూర్చున్నాను.

ఆ రోజుల్లో గోదావరి గట్టుకి షికారు వెళ్ళేవాళ్ళం రిక్షాలో. అది జ్ఞాపకం వచ్చింది. తల తిప్పి కిర్మయివైపు చూశాను. తనుకూడా నావైపే చూస్తోంది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి.

దుర్గకొండ దగ్గరికు రాగానే కొబ్బరికాయ అరటిపళ్ళు కొంది కిరణ్మయి. మెల్లెక్కుతూంటే-"ఇలా యెన్ని గుళ్ళు తిరిగితే నా పాపం పోతుందంటారూ?" అనడిగింది.

"పాపమా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. ఒక మనిషి మనసు కష్టపెట్టిన పాపం!" కిరణ్మయి అంది.

నేనేదో అనబోతూంటే తనే అంది- "నా పాపానికి ప్రాయశ్చిత్తం యేమిటి?" అని.

నేను చిన్నగా నవ్వి-"కిరణ్మయీ....నిన్ను నేను అసహ్యించుకుంటున్నాననీ ద్వేషిస్తున్నాననీ, శపిస్తున్నాననీ అనుకుంటున్నావా? లేదు కిరణ్మయీ అలాంటిదేం లేదు. నువ్వు సుఖంగా వుండాలనీ సంతోషంగా వుండాలనీ కోరుకుంటున్నాను. అలాంటప్పుడు ఈ ప్రాయశ్చిత్తాలూ-పశ్చాత్తాపాలూ అనవసరం. అవును కదూ?" అడిగాను.

కిరణ్మయి పెదవులు అదురుతున్నాయి.కళ్ళు చెమరుస్తున్నాయి.

"కాని నా మనసులో సందేహానికి సమాధానం దొరకలేదు కిరణ్మయీ. అందుకనే కాస్త అశాంతిగావుంది. మరికాస్త బాధగా కూడా వుంది. ఎందుకో తెల్సా? నిన్నింతంగా మనసిచ్చి ప్రేమించానే....నిష్కల్మషంగా కోరుకున్నానే? నా ఆరాధన-అభిమానం నీ పట్ల యెందుకు వ్యర్థమైపోయాయి? యెందుకు

ఫలించకుండాపోయాయి?....నీకు వాటిలో ఏం లోపం కనిపించింది?

ఆడదానికి మనసూ - మనువూ ఒకరితోనే అంటారు.అటువంటిది నువ్వు ప్రేమ ఒకరితో-పెళ్ళి ఒకరితో ఎలా వేరుచేసి చూడగలిగావ్? కథల్లోనూ నిజంలోనూ కూడా మగాడు తెలిసి తెలిసీ ఆడదాన్ని అన్యాయం చేయటం వుంది కాని ఆడది మగాడిపట్ల ఇంత దయ లేకుండా ప్రవర్తించటం వుందా? ఇట్ సీమ్స్ వెరీమచ్ స్ట్రేంజ్....అ:..చాలా కొత్తగా వుంది....చాలా వింతగా వుంది." ఆవేశంగా అన్నాను.

నా మాటల ధాటికి కిరణ్మయికి నిస్సత్తువ వచ్చినట్లుంది. మెట్లమీద కూలబడిపోయింది. నన్ను నేను కూల్ చేసుకోవడానికి అయిదు నిముషాలు పట్టింది. కిరణ్మయి లేచి నిల బడింది.

"సారీ కిరణ్మయీ. వెరీసారీ!" అన్నాను నా ఆవేశానికి సిగ్గుపడుతూ.

ఇన్నేళ్ళల్లోనూ ఆమె నాకు దక్కకపోవ టానికి నా దౌర్భాగ్యమే కారణం అనుకున్నాను కాని కిరణ్మయిని యెప్పుడూ నిందించలేదు మనసులో కూడా!

గుళ్ళోకి వెళ్ళాక దుర్గదర్శనం చేసుకుని మండపంలోకి వచ్చి కూర్చున్నాం. గుళ్ళో యెక్కువ జనం లేరు. ఉన్నవాళ్ళు యెవరి మానాన వాళ్ళు వున్నారు.

కిరణ్మయి కాసేపున్నాక - "మీకొకటి చెప్తాను. కాని విన్నాక మీరు నా తెలివి తక్కువతనానికి నవ్వుతున్నా...జాలిపడినా ఫర్వా లేదు కాని, నన్ను యేవగించుకోకండి. నన్ను తిట్టుకోకండి.

నేను హైస్కూలు దాటి కాలేజీకి వచ్చాక ప్రేమగురించితెలుసుకోవటం ప్రేమ కథలు చదవటం-వినటం మొదలుపెట్టాను.నాకు ప్రేమ అనే మాటలో తీయదనం ఏదో థ్రిల్ తోచేవి. ఆ థ్రిల్ గురించి మనసు పదే పదే ఆలోచించేది. అప్పుడే నాకు మొదటిసారిగా అనిపించింది ప్రేమిస్తే ఏమౌతుందీ? యెలా వుంటుంది? అని. ఏ ప్రేమకథ చదివినా, ఏ ప్రేమని గురించి విన్నా నాకు ప్రేమించుకోవడం వరకే బావుండేది. ఆ ప్రేమ పెళ్ళికి దారితీస్తే దాని అందం-దాని తీయదనం తగ్గిపోతాయేమో ననిపించేది. చివరకు ప్రేమ ప్రేమించుకోవటం వరకే బావుంటుందన్న అర్థంలేని నిర్ణయానికి వచ్చింది నా మనసు.

ఆ ప్రేమలోని థ్రిల్ చూసేందుకు మిమ్మల్ని ప్రేమలోకి దింపాను. ప్రేమపలుకుల్లోని తీయదనాన్ని చవి చూశాను. ప్రేమ లేఖలు అందుకోవటంలోని అనుభూతి చవి చూశాను. ఇంకా....ఇంకా....మీ సమక్షంలో ప్రేమ ప్రసాదించే అందాలు చాలా చూశాను.

ఒక్కొక్కసారి మీరు నా పట్ల కనపర్చే ప్రేమకు హృదయం పొంగిపోయేది. ఒకలా మనసుగా మీకు నేను పూర్తిగా అంకితం అయిపోయాను. మిమ్మల్ని చూడని క్షణం నా మనసు విలవిలలాడిపోయేది. అణువణువునా నాలో మీరే నిండిపోయారు.

మరైతే మరొకర్ని యెందుకు పెళ్ళిచేసుకున్నావ్ అని మీరడగొచ్చు. చెప్పాను నా మూర్ఖత్వం గురించీ....ప్రేమ పెళ్ళికి దారి తీస్తే యెక్కడ యింకిపోతుందోననే భయం మిమల్ని పెళ్ళి చేసుకోకూడదు అనుకునేలా చేసింది. మీరు యెల్లకాలం ప్రియాతిప్రియమైన ప్రేమికుడిలాగే వుండిపోవాలి. సంసారమూ-పిల్లలూ-చికాకులూ వీటిమధ్య యిరుక్కుని మీపట్ల నా అరాధన నాశనం కాకూడదు. అదీ అప్పట్లో నా ఆలోచన.

చూశారా యెంత తెలివితక్కువతనమో? ప్రేమ పెళ్ళితో మరింత గట్టిపడుతుందీ, పిల్లల వలన ఇంకా వృద్ధి చెందుతుందీ అన్న సత్యం నాకు తెలియనే తెలియదు.

నూరేళ్ళ బంధంలోనూ - నూరేళ్ళ సహచర్యంలోనూ ప్రేమ ఇంకిపోవటం అంటూ వుంటుందా? అందుకే అలాంటి అవివేకానికి పాల్పడినందుకే యిప్పు డనుభవిస్తున్నాను.

ప్రేమించినదాన్ని పొందలేక పొందినదాన్ని ప్రేమించలేక నరకం అనుభవిస్తున్నాను.


ఈ కోరికలూ పిల్లలూ వారితో నా సంబం






# భారతదేశములో ప్రఖ్యాతిగాంచిన

5 సంవత్సరములు గ్యారంటీ ఉండే మేరి 22Ct సూపర్ స్పెషల్ బంగారు కవరింగు ఆభరణములను, 15 సం॥ల నుండి ఆలోచించి, మొట్టమొదటి సారిగా తయారుచేసి, భారతదేశము మొత్తము వి. పి. పి. ద్వారా పంపించే పెద్ద స్థాపనము దీనికి కావలసిన వివరములకు, ఈ దిగువ అడ్రసుకు ఉత్తరము వ్రాసిన కేటలాగు ఉచితముగా పంపబడును.




దీనిలో ఉండే నంబరును, ధరను శుభ్రముగా, ఉత్తరము ద్వారా వ్రాస్తే, వి. పి. పి. ద్వారా పంపబడును. మీ అడ్రసును శుభ్రముగా పిన్ కోడుతోను, అంగ్లములో వ్రాయవలయును. వి.పి.పి. చార్జి ఏగస్ట్రా అగును.

ఏజంట్లు కావలయును : ఏజంట్లకు ప్రత్యేక సదుపాయములు కలవు. వివరములకు ఈ క్రింది అడ్రసుకు వ్రాయవలయును. అడ్రసు తప్పనిసరిగా అంగ్లములో వ్రాయవలయును.

"MERI GOLD COVERING WORKS," ESTD 1963
No. 14, RANGANATHAN STREET,
Post-Box No. 1405, T. NAGAR, MADRAS-600 017

ధాలూ అంతా యాంత్రికం. అవన్నీ తప్పనిసరై తప్పించుకోలేనివై" చెప్పటం ముగించింది.

ఆమె చెప్పేదంతా ఆశ్చర్యంగా వింటూ వుండిపోయాను. ఆమె విపరీతమైన ఆలోచనకు మతిపోయింది.

"చేతులు కాలిపోయాయి. ఇప్పుడేమనుకుంటే లాభం యేమిటీ? తలుచుకు తలుచుకు యేడవడం తప్పించి చేసిన తప్పును దిద్దుకునే అవకాశం లేకుండా పోయింది. బ్రతుకంతా ఈ బాధ హృదయంలో గూడు కట్టుకుని వుండవల్సిందే! నేనిద్దరు మగాళ్ళపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నాను. నేనిద్దరు మగాళ్ళకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నాను. ప్రేమించి మీ పొందు దూరం చేసుకుని ఒక తప్పు చేశాను- ప్రేమలేని పొందు అనుభవిస్తూ మరొకరిపట్ల తప్పు చేస్తున్నాను. మనసుగా మీకూ - తనువుగా మరొకరికీ అంకితమైన వింత బ్రతుకు నాది. అతి నీచమైన జీవితం నాది... ఒకలా నేను అపవిత్రురాలిని, అపరాధిని. చెప్పండి! నా నేరానికి శిక్షేమిటీ? జీవితాంతం ఈ క్షోభ అనుభవించవల్సిందేనా? ఈ మానసిక సంఘర్షణలో నలిగిపోవటమేనా?....ఎలా....ఎలా!"

కిరణ్మయి మోకాళ్ళమీద తలవాల్చి వెక్కి-వెక్కి యేడ్చేసింది.

నా కామెని ఏమని ఓదార్చాలో ఎలా సముదాయించాలో అర్థం కాలేదు. భగ్న ప్రేమికుడిగా నేను అనుభవిస్తున్న క్షోభకంటే ప్రేమని చేతులారా దూరం చేసుకున్న ఆమె స్థితి చాలా భయంకరంగా అనిపించింది. నాకైతే మనసారా యేడవటానికేనా అవకాశం వుంది. కాని కిరణ్మయి విషయంలో అలా కాదు. కన్నీళ్ళ బరువుని కూడా కళ్ళల్లో దాచుకోవాలి....బాధలతో బెంగలతో మౌనంగా నలిగిపోవాలి. నాకేదైనా అంతవరకూ ఆమెపట్ల కోపం-ద్వేషం వుండివుంటే అవన్నీ మంచులా కరిగిపోయాయి. కిరణ్మయి నా పట్ల అన్యాయంగా ప్రవర్తించి వుండవచ్చు. కాని - అది నా పట్ల ప్రేమని నిలుపుకోటానికే అనుకునేసరికి ఆమె పట్ల మనసంతా సానుభూతితో నిండిపోయింది.

చీకటిపడుతోంది. కొండక్రింద వూరంతా దీపాలతో వెలిగిపోతోంది. కిరణ్మయి మనస్సుకి ప్రశాంతి ప్రసాదించమని దేవతని వేడుకున్నాను. మరో జన్మంటూ వుంటే అప్పుడైనా కిరణ్మయిని నాకు దక్కేలా చేయమని కోరుకున్నాను.

కిరణ్మయి ఇంకా వెక్కుతూనే వుంది.

నా హృదయంలోంచి జాలీ....ప్రేమా.... ఆపేక్ష పెల్లుబికిపోయాయి. ఆమె తలమీద చేయివేసి-"కిరణ్మయీ లే....ఛ....ఛ....యేడుస్తున్నావా? వద్దువద్దు యేడవకు!నువ్వు నవ్వుతూ వుండాలి...." అన్నాను ఓదారుస్తూ.

కిరణ్మయి తలెత్తి చూసింది.

ఆమె కనుకొలకుల్లో నీటి బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. నా చేతినున్న వాచీ చూసుకున్నాను "ముహూర్తానికి వేళవుతోంది లేద్దామా?" అనడిగాను

తలూపి లేచింది కిరణ్మయి.

మెట్లు దిగుతూంటే కిరణ్మయి అడిగింది - "మీరిలా యెన్నాళ్ళుంటారూ?? మీరిలా వుంటే నేను సుఖపడగలనా? పెళ్ళి చేసుకోకూడదూ!"

నేను నవ్వాను. "ఇప్పుడు నా వయస్సెంతో తెలుసా కిరణ్మయీ? ఇప్పుడు ఇంక పెళ్ళేమిటీ?....అయినా ప్రేమ ఒకచోట పెళ్ళి ఒకచోట తప్పు కదూ?" అడిగాను.

కిరణ్మయి దెబ్బతిన్నట్లు చూసింది.

నేనది గమనించనట్లు వుండిపోయాను.

కిరణ్మయి యేదో అనటానికి ప్రయత్నించి ఆగిపోయింది. నన్ను తనిక వొప్పించలేనని గ్రహించి వుంటుంది.

కిరణ్మయి మెట్లుదిగుతోంది.

ఆమె ప్రక్కనే అడుగులో అడుగు వేస్తుంటూ నేను మెట్లు దిగుతున్నాను. ఏడడుగులు కలిసి వేస్తే ఒకరి కొకరవుతారంటారు. మేమిద్దరం ఇప్పటికే కొన్ని వేల అడుగులు కలిసి వేసుంటాం .... అయినా మేం ఎవరికి వారయిపోయాం.

మౌనంగా నడుస్తున్నాం ఇద్దరం! □



## సరికొత్త సైంటిఫిక్, రొమాంటిక్ సీరియస్ సీరియల్



# యుగాంతం!

## యండమూరి వీరేంద్రనాథ్

### II

గోపాలకృష్ణ ఎక్స్పేచే చేతిలో ఆ వుత్తరం వుంది. దాన్ని చూసి అతడు చాలాసేపు నవ్వుకొన్నాడు. ప్రధానమంత్రికి చాలా రకాలైన ఉత్తరాలు వస్తూంటాయి. కొన్ని తిడుతూ, కొన్ని దేశ సమస్యల గురించీ, కొన్ని పర్శనల్ ప్రాబ్లమ్స్, అభ్యర్థనలూ....యిలా. అప్పుడప్పుడు ప్రేమలేఖలు కూడా.

కానీ యిలాంటి ఉత్తరాలు రావటం మాత్రం చాలా తక్కువ.

అతడిముందు మూడు 'రాక్'లు వున్నాయి. ఒకటి ఫస్టు సెక్రటరీకి వెళ్ళాల్సిన ఉత్తరాలు. వాటిలోకొన్ని ఏరి, ఫస్టు సెక్రటరీ ప్రధాన మంత్రికి పంపుతాడు. రెండో రేక్‌లో తను జవాబు వ్రాయాల్సిన వుత్తరాలు పడేస్తాడు. మూడో రాక్‌లో వుత్తరాలమీద ఏ చర్యా తీసుకోవాల్సిన పని లేదు.

ప్రొఫెసర్ ఉత్తరం మూడో రాక్ చేరుకొంది.

మూడు 'రాక్స్'లోకి ఉత్తరాలు విడదీసిన తర్వాత మొత్తం మూడు ఫైళ్ళు ప్రధాన మంత్రికి వెళ్తాయి. మొగటి ఫైలు మాత్రం ఆయన చూస్తారు. మిగతా రెండూ కేవలం ఆయన చూడదల్చుకొంటే పరిశీలించటానికే.

ఈ ఉత్తరాలు చూడటానికి ఆయన దినచర్యలో టైము ప్రొద్దున్న తొమ్మిది నుంచీ తొమ్మిదిన్నరవరకూ.

ఆగస్టు ఒకటో తారీఖు తొమ్మిదిన్నరకి ఆయనకి పార్టీ చీఫ్ అవినాష్‌తో అపాయింట్‌మెంటుంది. అంటే ఉత్తరాలు చూడటం పూర్తయ్యేక.

తొమ్మిదిన్నరవరకూ మామూలుగానే ఆయన మొదటి ఫైలు నెట్టేసేడు.

అవినాష్ ఇంకా ఆలేదు.

సాధారణంగా ప్రైమ్మినిస్టర్ ప్రోగ్రాంలో రావల్సినవాళ్ళు ఆలస్యం వుండదు. ఒకవేళ అలాంటిదేదైనా వుంటే, ఇంకో విజిటర్‌ని పంపటం జరుగుతుంది. ఈ చిన్న చిన్న విజి